సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం ၊ 27 ၊ జనవరి ၊ 2025



మా బిడ్డలకు ఏదీ రక్షణ?

'మా బిడ్డలకు ఏదీ రక్షణ?' అంటూ విద్యార్థినుల తల్లిదండ్రులు కేజీబీవీ బాధ్యులను ప్రశ్నించారు. ఆడిట్ బృందం గ్రామసభ నిర్వహించి వాస్తవాలు బహిర్గతం చేసింది. -8లో



ఆగి ఉన్న లారీని ఢీకొన్న బొలెరో

ఆగి ఉన్న లారీని బోలెరో వాహనం ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన శనివారం రాత్రి బి.కొత్తకోట మండలం కోటిరెడ్డిగారిపల్లి వద్ద జరిగింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 50 మెట్రిక్ టన్నులు



జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళిక



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్, ఎస్పీ



పోలీసు పరేడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్



గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

- 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే ధ్యేయం
- పేదల ఆకలి తీరుస్తున్న అన్నా క్యాంటీన్లు
- అన్ని రంగాల్లో జిల్లాను తీర్చిదిద్దుతున్నాం
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ చామకూరి శ్రీధర్

సాక్షి రాయచోటి: 2047 నాటికి స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యమే ధ్యేయంగా అధికారులందరూ ముందుకు సాగాలని.. జిల్లాను అన్నివిధాలా సమగ్రాభివృద్ధి దిశగా నడిపిస్తామని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పిలుపునిచ్చారు. ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ శ్రీధర్ ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో కలిసి పోలీసులతో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి జిల్లా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశయాలను, ఆకాంక్షలను అధికారులు ప్రజలల్లోకి తీసుకెళ్లాలని తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పానికి అనుగుణంగా అధికారులందరూ పని చేయాలని కోరారు.

మహాత్ముల స్ఫూర్తితో...

నేడు మనం 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నాం. జాతిపిత మహాత్మ గాంధీ, పండిత్ జవహర్ లాల్ నెహ్రూ, మౌలానా అబ్దుల్ కలాం అజాద్, డాక్టర్ బాబు జగ్జీవన్ రాం, జ్యోతిరాం పూలే, అల్లూరి సీతారామరాజు, కోమరం భీమ్‌లతోపాటు ఎందరో అమర వీరులు చేసిన ఎనలేని త్యాగాల ఫలితంగా మన దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. ఈ సందర్భంగా ఆ మహనీయులను స్మరిస్తూ వారందరికి ఘన నివాళులర్పిస్తున్నాను. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన మన దేశానికి ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించారని కొనియాడారు.

- జిల్లాలో అన్నా క్యాంటీన్ల ద్వారా పేదవారికి ఆకలి తీరుస్తున్నాం. కేవలం రూ.5లకే వారి కడుపు నింపుతున్నామన్నారు.
- 2047 సంవత్సరం నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి పది సూత్రాల ప్రణాళిక ఇచ్చారు. పేదరికం లేకుండా చేయడం, ఉపాధి అవకాశాలను పెంచడం, నైపుణ్యాభివృద్ధి, మానవ వనరుల అభివృద్ధి ఇలా పది సూత్రాలను అమలు చేసి 2047 నాటికి రాష్ట్రాన్ని ఎస్2ప్లస్ ట్రిలియన్‌డాలర్ వృద్ధీకరణ రాష్ట్రంగా చేసేందుకు కృషి చేస్తున్న సీఎం స్ఫూర్తితో పనిచేస్తామన్నారు. అన్నమయ్య జిల్లా ప్రతి సంవత్సరం 15శాతం వృద్ధి రేటు సాధించేలా ప్రణాళిక పెట్టుకున్నామన్నారు.



- పజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. నూతన ప్రభుత్వం ఏర్పడిన 2024 జూన్ మాసం నుండి ఇప్పటివరకు ప్రజల నుంచి 9050 అర్జీలలో 6975సమస్యలను పరిష్కరించామని తెలిపారు.
- రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించి రైతుల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఇప్పటివరకు 4052 అర్జీలను పరిష్కరించాం. మిగిలిన వాటికి కూడా పరిష్కారాలు చూపనున్నామన్నారు.
- ఇసుక సామాన్యుడి హక్కు. ప్రభుత్వానికి ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా హార్సిలీ హిల్స్‌లోని ప్రముఖ ఒబెరాయ్ సంస్థ ద్వారా సెవెన్ స్టార్ హోటల్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామన్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ మేరకు దీపావళి కానుకగా దీపం–2 పథకాన్ని గత ఏడాది నవంబర్ మాసం నుంచి జిల్లాలో అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు అన్నమయ్య జిల్లాలో 2,66,623మంది వినియోగదారులకు ఉచిత గ్యాస్‌ను అందిస్తూ రూ.21.46కోట్ల సబ్సిడీని అందించామన్నారు. ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ కింద 2,18,900మంది లబ్ధిదారులకు ప్రతినెలా రూ.93.60కోట్లు అందిస్తున్నామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘ సభ్యుల జీవనోపాధుల మెరుగుపరుచుకోవడానికి ఇప్పటివరకు 8956 గ్రూపులకు రూ.934కోట్ల బ్యాంకు రుణాలను ఇచ్చామన్నారు. అన్నదాతలకు సంబంధించి పీఎం కిసాన్ పథకం ద్వారా 1.77లక్షల మంది రైతుల ఖాతాలకు రూ.70కోట్లు జమ చేసినట్లు చెప్పారు.
- జిల్లాలో పేద ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు లభించడంతోపాటు జిల్లాలోని ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో 9580మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు వసతి కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.
- జిల్లా కేంద్రంగా ఏర్పడిన రాయచోటి పట్టణాన్ని ప్రభుత్వ సహకారంతో అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ, మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, అన్నమయ్య వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, ఇతర సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



అగ్నిమాపకశాఖ సిబ్బంది విన్యాసం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గ్రామాలకు నూతన రోడ్లు

గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుంది. పల్లెలకు పూర్వ వైభవం తీసుకరావాలన్న ఆలోచనతో కూటమి ప్రభుత్వం 2024 అక్టోబర్ 14న పల్లె బాట కార్యక్రమం నిర్వహించింది. జిల్లాలో 501 గ్రామ పంచాయతీలలో మొదటి విడతగా రూ.64కోట్లతో 841పనులను మంజూరు చేయడం జరిగింది. ఇందులో 618 పనుల ద్వారా 86కి.మీ మేర గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్లు వేశాం. రెండోవిడతగా రూ.24.72కోట్లతో 408పనులు మంజూరు చేశాం. వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్‌ఆర్ జిల్లా డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి సస్పెన్షన్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మహిళా ఉద్యోగిపై లైగింక వేధింపులకు పాల్పడిన జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్(డీటీసీ) చంద్రశేఖర్ రెడ్డిని సస్పెండ్ చేశారు. ఈమేరకు రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి రిపోర్టు చేసుకున్నారు. విచారణ జరిపిన ఉన్నతాధికారులు లైంగిక వేధించినట్లు రుజువు కావడంతో ఆయనను సస్పెండ్ చేశారు.

పోక్సో కేసు నమోదు

కలికిరి: పెళ్లి చేసుకుంటానని బాలికను మోసగించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు యువకునిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు. రొంపిచెర్లకు చెందిన బాలిక కొంత కాలంగా తన బంధువుల ఇంట్లో గడిలో ఉంటోంది. గడికి చెందిన ఓ యువకుడు.. ప్రేమ, పెళ్లి పేరుతో వంచించాడు. బాధితురాలు తల్లిదండ్రులకు తెలియచేయంతో వారు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు కావడంతో రాయచోటి డీఎస్పీ క్రిష్ణమోహన్ గడికి చేరుకుని విచారణ చేశారు.

సెల్ చూడొద్దన్నందుకు బాలిక ఆత్మహత్య

రాజంపేట: పట్టణంలోని మన్నూరు పోలీసుస్టేషన్ పరిధి సాయినగర్‌లో మద్రిపల్లె శ్రావ్యకుమారి(14)ను సెల్‌చూడొద్దని తల్లి మందలించినందుకు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సాయినగర్‌లో నివసిస్తున్న ఎం.శ్రీనివాసాచారి దంపతులకు ఏకైక కుమార్తె శ్రావ్య. మన్నూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. నిత్యం సెల్ ప్రపంచం అన్నట్లుగా కొనసాగుతున్న కూతురిని తల్లి తీవ్రంగా మందలించింది. దీంతో హైస్కూల్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనింది. వేడుకలు ముగిసిన అనంతరం నేరుగా ఇంటికి వచ్చింది. స్నానం చేస్తా అని చెప్పి గదిలోకి వెళ్లింది. తల్లి బయట ఉంది. ఎంతకీ రాకపోయే సరికి తల్లిలో ఆందోళన హెచ్చరిల్లింది. పిలిచినా పలకలేదు. దీంతో ఇంటి వెనుక ఉన్న బేల్దారి పని చేసే వారు వచ్చి తలుపు పగులగొట్టి చూస్తే లోపల ఉరి వేసుకుంది. ఇది చూసి తల్లి తల్లడిపోయింది. కన్నీరుమున్నీరుగా విలపించింది. స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలిక మృతి చెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, తల్లికి అప్పగించారు. కాగా తండ్రి శ్రీనివాసాచారి అరుణాచలం వెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు. ఒక్కగాని ఒక్క కూతురు ఇక లేదన్న బాధ ఆ కుటుంబానికే కాకుండా , చుట్టుపక్కల వారి హృదయాలను కూడా కలిచి వేసింది. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తుల సంఖ్య పెంచేలా చర్యలు

ఒంటిమిట్ట రామాలయానికి విచ్చేసిన నిపుణుల బృందం

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో భక్తుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకుంటామని ప్రత్యేక నిపుణుల బృందం సభ్యులు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ముగ్గురు సభ్యులతో కూడిన బృందం ఒంటిమిట్టకు విచ్చేసింది. రామాలయం వద్ద ఉన్న అధికారిక భవనంలో బృందంలోని సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలంటే ఏం చేయాలనే దానిపై సంబంధిత టీటీడీ అధికారులతో వారు చర్చించారు. ఒంటిమిట్ట చెరువును ట్యాంకు బండగా తీర్చిదిద్దాలని, భక్తులు స్వామివారిని దర్శించుకునే విధానాన్ని ఆగమశాస్త్రం ప్రకారం తీసుకురావాలని, త్రేతాయుగంలో ఏర్పడిన రామతీర్థానికి పూర్వ వైభవం తీసుకురావాలని, ఒంటిమిట్ట చెరువు కట్టపై ఉన్న ఖాళీ జాగాలో అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించారు. అలాగే భక్తులు అన్న ప్రసాదానికి ఇబ్బంది పడకుండా శాశ్వత అన్న ప్రసాద కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఒంటిమిట్ట రామాలయం నుండి కల్యాణ వేదిక వరకు రోడ్లను విస్తరించాలని, ఎస్సీ బాలుర హాస్టల్ సమీపంలో ఖాళీగా ఉన్న 7.5 ఎకరాల కోదండరామస్వామి మాన్యాన్ని అభివృద్ధికి ఉపయోగించాలని నిర్ణయించారు. అలాగే ఒంటిమిట్టలో ఉన్న తొమ్మిది పురాతన మండపాలను పునరుద్ధరించాలని, పురాతన ఆచారాల ప్రకారం ఒంటిమిట్టలో ఏయే కైంకర్యాలు జరిగేవో వాటిని మళ్లీ తీసుకురావాలని యోచిస్తున్నారు. దీనికి సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని వారు వివరించారు.



రామతీర్థాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక నిపుణుల బృందం

- 2018లో ఈదురు గాలులు విపరీతంగా వీచి కల్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లు పడిపోయి ప్రాణ నష్టం జరగడంతో అప్పటి ప్రభుత్వం శాశ్వత కల్యాణ వేదికను నిర్మించాలని ఆదేశించింది. దీంతో శాశ్వత కల్యాణ వేదిక ఏర్పాటు చేశారు. ఆదివారం అదనపు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వచ్చిన నిపుణులు బృందంలోని సభ్యులు శాశ్వత కల్యాణ వేదికను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎలివేషన్ కోసం నాసిరకపు రేకులతో షెడ్లు వేశారని విమర్శించారు.

ఆర్టీసీలో పదోన్నతులకు అనుమతులు ఇవ్వాలి

రాయచోటి అర్బన్: ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న 3000 వేల ఉద్యోగుల పదోన్నతులకు ప్రభుత్వం వెంటనే అనుమతులు ఇవ్వాలనీ ఏపీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలిశెట్టి దామోదరరావు, జె.వి.నరసయ్యలు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అజయ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా విస్తృత స్థాయి జనరల్‌బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఆర్టీసీ ఉద్యోగులకు అందుబాటులో ఉన్న రెఫరల్ ఆసుపత్రుల ద్వారా అందించే వైద్యసౌకర్యాన్ని తొలగించి ఈహెచ్‌ఎస్ ద్వారా వైద్యాన్ని అందించడం తగదన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు 2019లో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఇచ్చి న సర్క్యులర్ నంబర్. పిడి 01 / 2019ని అమలు చేయాలన్నారు. ఈయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరాజు, ఈయు కడప జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.కె.కుమార్, రాజశేఖర్, అన్నమయ్య జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు ఆనందబాబు, బి.సి.శేఖర్, గౌరవ అధ్యక్షుడు నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడతున్న జె.వి.నరసయ్య

ఘనంగా అట్‌హోమ్

రాయచోటి: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్థానిక జిల్లా కలెక్టర్ బంగ్లా ప్రాంగణంలో ఆదివారం అట్‌హోమ్ కార్యకమం జరిగింది. జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఏర్పాటు చేసిన ఈ తేనేటి విందులో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్‌ఓ మధుసూదన్ రావు, సబ్ కలెక్టర్‌లు మేఘస్వరూప్, వైఖోమ్ నదియా దేవి, ఆర్డీఓ శ్రీనివాసులు, ఏఎస్పీ వెంకటాద్రి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను అధికారులందరూ సమన్వయంతో విజయవంతం చేసినందుకు కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో చేయాలన్నారు. అట్‌హోమ్ కార్యక్రమంలో డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు వెంకటరత్నం , సత్యనారాయణ, సమాచార శాఖ డిఐపీఆర్‌ఓ భరత్ కుమార్ రెడ్డి, డీపీఆర్‌ఓ పురుషోత్తం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ప్రసన్న కుమార్, పీఆర్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలు దయాకర్ రెడ్డి, సహదేవ రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, మున్సిపల్ కమీషనర్ వాసుబాబు, పర్యాటక అధికారి నాగభూషణం, కలెక్టరేట్ ఏఓ నాగభూషణం, కో–ఆర్డినేషన్ సెక్షన్ నరసింహ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అట్‌హోమ్‌లో కలెక్టర్, అధికారులు

శిక్షణ ఫలాలు విద్యార్థులకు చేరాలి

కడప ఎడ్యుకేషన్: శిక్షణలో నేర్చుకున్న ఫలాలు విద్యార్థులకు చేరాల యోగివేమన విశ్వవిద్యాలయం వీసీ కె. కృష్ణారెడ్డి అన్నారు. శ్రీపెరంబుదూర్లోని రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్, వైవీయూ ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో 'యువత మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం పై'నిర్వహించిన మూడు రోజుల శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ద్వారా ఎక్కువ మందికి సమాచారాన్ని చేరవేయగలిగితే మంచి కుటుంబం, మంచి సమాజం తద్వారా దేశాభివృద్ధి జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

రంగనాథస్వామి ఆలయం పునరుద్ధరణ

పురావస్తుశాఖ ఏడీ శివకుమార్

సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలం గట్టు సమీపంలోని కొండపై వెలసిన రంగనాథ్వసామి ఆలయాన్ని పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గుప్త నిధుల ముఠాలు అలయాన్ని ధ్వంసం చేసిన విషయం గురించి గత డిసెంబర్ 23న సాక్షిలో 'చరిత్ర విధ్వంసం'శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై తిరుపతి పురావస్తుశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.శివకుమార్ స్పందించారు. ఇటివల ఆయన కొండపైకి వెళ్లి నేలమట్టమైన ఆలయాన్ని సందర్శించి ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్రకు సాక్ష్యమైన ఆలయాన్ని ధ్వంసం చేయడం దారుణమైన విషయమని అన్నారు. గర్భగుడి, ఆలయం మొత్తం పడిపోవడంతో వాటినైనా పునరుద్ధరించి ఇక్కడి చరిత్ర శిథిలం కాకుండా చూడాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. ఆదివారం శివకుమార్ మాట్లాడుతూ ఆలయం ఉన్నస్థితి చూసి బాధ కలిగిందన్నారు. ఆలయాల్లోని రాళ్లలో, గర్భగుడిలో ఎలాంటి నిధులు, నిక్షేపాలు ఉండవని స్పష్టం చేశారు. గుప్త నిధుల ముఠాలు దీనిపై అపోహతో వాటిని ధ్వంసం చేస్తూ చరిత్రకు సాక్ష్యాలు లేకుండా చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైన గుప్త నిధుల ముఠాలు దీన్ని గుర్తించి ఆలయాల జోలికి వెళ్లవద్దని కోరారు. రంగనాథస్వామి ఆలయ పునరుద్ధరణ కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు. తొలుత ఇంజనీర్లను పంపి ఆలయాన్ని పరిశీలింపజేయాలని కోరినట్టు చెప్పారు.

తక్కువ ధరకే బంగారం ఇస్తానని మోసం

రాయచోటి టౌన్: తక్కువ ధరకే బంగారం ఇస్తానని నమ్మించి మోసం చేశాడని రాయచోటి మాసాపేటకు చెందిన లీలా మహేశ్వరి ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె తన పిల్లలతో కలిసి ఎన్‌పీ కుంటలోని ముళ్లవారిపల్లెలోని మోసం చేసిన వ్యక్తి ఇంటి ఎదుట ఆదివారం ధర్నాకు దిగింది. ఈ సందర్భంగా ఆమె తన గోడు విలేకరులతో వెల్లబోసుకుంది. వివరాలు బాధితురాలి మాటల్లోనే.. 'ఇన్‌స్టాగాం ద్వారా ఎన్‌పీ కుంట ముళ్లవారిపల్లెకు చెందిన మల్లెం బాలాజీ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. మాటల సందర్భంలో తాను తక్కువ ధరకే బంగారం ఇస్తానని చెప్పి నమ్మించాడు. దీంతో తనతోపాటు తన స్నేహితులతో కూడా డబ్బులు కట్టించాను. మొత్తం రూ.20 లక్షలకు పైగా ఇచ్చాను. తరువాత డబ్బులు అడిగినా ఇవ్వకుండా బంగారు ఇవ్వకుండా మోసం చేస్తున్నాడు. దీంతో డబ్బులు కట్టిన వారు నిలదీయడంతో తన ఇంటిని కూడా అమ్మి బాకీలు చెల్లించినా, ఇంకనూ ఉన్నాయి. ఉన్న ఇంటిని కూడా అమ్మేయడంతో బాడుగ ఇంటిలో కాపురం ఉంటున్నాము. పిల్లలకు కావాల్సిన భోజనం కూడా సక్రమంగా పెట్టలేని పరిస్థితిలో ఉన్నాను. పూర్తి స్థాయిలో విచారణ చేసి మోసం చేసిన వ్యక్తి ద్వారా డబ్బులు ఇప్పించాలి' అని ఆమె మొరపెట్టుకొంది.

బ్రహ్మోత్సవ వైభవం!

- 28 నుంచి కడప రాయుని బ్రహ్మోత్సవాలు
- చురుగ్గా కొనసాగుతున్న ఏర్పాట్లు

కడప కల్చరల్: తిరుమల తొలిగడపగా భావించే దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఆలయ గోపురం ఎదుట ఉత్సవాల వివరాలను క్లుప్తంగా తెలుపుతూ ఫ్లెక్సీ ఆర్చీని ఏర్పాటు చేశారు. ఆలయ గోపురానికి రంగులు వేస్తున్నారు. ఆలయం లోపల కూడా పలుచోట్ల రంగులతో ముగ్గులు వేస్తున్నారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో, వెలుపల ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం లోనూ, ఆలయ గోపురం, ప్రహారీలకు విద్యుద్దీపాలతో సీరియల్ సెట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంలో అడుగు పెట్టగానే బ్రహ్మోత్సవాల శోభ కనిపించేలా ఆ ప్రాంగణాన్ని తీర్చిదిద్దుతున్నారు. రోజువారి సేవల కోసం వాహనాలకు మరమ్మతులు చేశారు. కడప నగరం నలుమూలల బ్రహ్మోత్సవాల వివరాలతో భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. రథోత్సవం కోసం రథానికి మరమ్మతులు చేపట్టి ఆకర్షణీయంగా రంగులతో సిద్ధం చేస్తున్నారు.



ఆలయ ప్రాంగణంలో చలువ పందిరి

ప్రత్యేక శ్రద్ధతో.....

తిరుమల తిరుపతి దేవస్థానాలకు చెందిన ఇద్దరు ఉన్నతాధికారులు కడప రాయిని బ్రహోత్సవాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. వారిలో ఒకరు కడప వారు కాగా మరొకరు కడపలో ఉద్యోగం చేశారు. జిల్లాలో దేవునికడప బ్రహ్మోత్సవాలకు గొప్ప పేరుంది. వారం రోజులపాటు వాహన సేవలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు. రథోత్సవం నాడు భారీగా తిరునాల జరుగుతుంది. రాయలసీమ నలుమూలల నుంచి భక్తులు భారీగా హాజరవుతారు. కడపలోని కృష్ణా సర్కిల్ నుంచి దేవునికడప వరకు, పాతకడప నుంచి ఆలయం వరకు రోడ్లు జనంతో నిండిపోతాయి. నిర్వాహకులు రెట్టించిన ఉత్సాహంతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని అన్ని ఏర్పాట్లు చేస్తు న్నారు. టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం నెలరోజుల క్రితమే ఆలయాన్ని దర్శించుకున్నారు. బ్రహ్మోత్స వాల ఏర్పాట్ల గురించి అర్చకులు, స్థానిక అధికారులతో చర్చించారు. పుష్కరిణిని ఆధునికీకరించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించగా, అందుకు అనుగుణంగా పనులు కొనసాగుతున్నాయి. మాడవీధుల్లో సిమెంటురోడ్డు అవసరాన్ని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. రథం తిరిగేందుకు అనుకూలంగా మార్చాలని కోరారు. మొత్తంపై ఈసంవత్సరం ఉత్సవాలను అర్చకులు, అధికారులు ప్రతిష్టగా తీసుకొని ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు చేస్తున్నారు.

క్లుప్తంగా

బ్రిడ్జిపై నుంచి కారు పల్టీ



బ్రిడ్జిపై నుంచి కింద పడిన కారు

బి.కొత్తకోట : వేగంగా వెళ్తున్న కారు చెరువు బ్రిడ్జిపై నుంచి కిందికి దూసుకెళ్లి పల్టీ కొట్టిన ఘటన ఆదివారం మండలంలోని బుచ్చిరెడ్డిగారిపల్లె సమీపంలోని గుమ్మసముద్రం చెరువు మొరవ వద్ద జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి రాలేదు. కారు అతివేగంగా బి.కొత్తకోట నుంచి మదనపల్లె వైపు వెళ్తూ గుమ్మసముద్రం మొదటి మొరవ వద్ద అదుపుతప్పి ఎడమవైపు ఉన్న మొరవలోకి వెళ్లి బండపై పడినట్లు తెలుస్తోంది. ముందు భాగం ధ్వంసం కాగా కారు పైకి నిలబడింది. ఇందులో ఎంత మంది ప్రయాణిస్తున్నారు, వారికి గాయాలయ్యాయా లేదా అనే సమాచారం కూడా లేదు. పోలీసులు ఆరా తీసినా వివరాలు లభ్యం కాలేదు.

చైన్ స్నాచింగ్

కలికిరి : పొలం వద్ద పనులు చేసుకుంటున్న వృద్ధురాలు మెడలో గుర్తుతెలియని వ్యక్తులు బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన ఆదివారం కలికిరి మండలం పారపట్ల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పారపట్ల గ్రామం కురవపల్లికి చెందిన కంభం భార్య ఆనందమ్మ పొలం పనులు చేసుకుంటుండగా ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చారు. వారిలో ఒక వ్యక్తి ఆమె వద్దకు వచ్చి కూరగాయలు కావాలని అంటూ మాటల్లో దింపి, మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ద్విచక్రవాహనం వద్ద వున్న ఇద్దరు వ్యక్తులతో కలిసి సమీపంలోని గుండ్లూరు–వాల్మీకిపురం రోడ్డులో గుండ్లూరు వైపు వెళ్లారు. దీంతో వృద్ధురాలు పెద్దగా కేకలు వేసింది. సమీపంలోని గ్రామంలోకి వెళ్లి జరిగిన ఘటనను తెలియజేసి, బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ నేతపై కేసు నమోదు

రాజంపేట : పుల్లంపేట మండలం రామక్కపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు సుబ్రమణ్యంనాయుడుపై ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు బాధిత విలేకరి కూరాకు శ్రీను ఆదివారం ఇక్కడి విలేకర్లకు తెలిపారు. ఎస్ఐ మోహన్‌కుమార్ గౌడ్ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ దృష్టికి విలేకరిని బెదిరించిన సంఘటన వెళ్లిన నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేయడం గమనార్హం.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన



గృహ నిర్మాణ శాఖ శకటం



ఐసీడీఎస్



వ్యవసాయ శాఖ



ఉద్యాన శాఖ



మున్సిపల్ శాఖ



ఈ-గవర్నెన్స్

రాయచోటి : గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రగతి శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ వేడుకలకు రాయచోటి పోలీసు పరేడ్ మైదానం వేదికైంది. జిల్లా అభివృద్ధిని ప్రతిబింబించేలా శకటాలను ప్రదర్శించారు. 2047 స్వర్ణ ఆంధ్ర విజన్ ప్రణాళిక 10 సూత్రాలపై అవగాహన కల్పించేలా శకటాలను రూపొందించారు. మైన్ ప్రొటెక్టెడ్ వాహనాలు, రవాణా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ప్రణాళిక, గ్రామీణ పేదరిక నిర్మూలన, గృహ నిర్మాణ, పరిశ్రమలు, పర్యాటక, వైద్య, ఆరోగ్య, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, జల వనరుల, వ్యవసాయ, మత్స్య, విద్యుత్ పంపిణీ, ఉద్యాన, సూక్ష్మ నీటిపాగు, పురపాలక ,సర్వే, రియల్ టైమ్ గవర్నెన్స్, విద్యా, సమగ్ర శిక్ష శాఖ, 108, 104 వాహనాలు తదితర ప్రగతి శకటాల ప్రదర్శన అబ్బుర పరిచింది.

సత్కారం



స్వాతంత్య్ర సమరయోధుడి కుమారుడిని సన్మానిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గణతంత్ర వేడుకల్లో భాగంగా స్వాతంత్య్ర సమరయోధుడి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. రాజంపేట తాలూకా ఉర్లగట్టుపోడుకు చెందిన స్వాతంత్య్ర సమరయోధులు రాఘవరాజు రామలింగరాజు కుమారులు రాఘవరాజు, రాధాకృష్ణమరాజును కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సత్కరించారు.



పంచాయతీరాజ్ శాఖ

ఉత్తమ సేవకు ప్రశంస

ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంస లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇందుకు రాయచోటి పోలీస్ పరేడ్ మైదానం వేదికైంది. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ప్రశంసా పత్రాలు అందించారు.

– రాయచోటి



కలెక్టర్ శ్రీధర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు



దయాకర్‌రెడ్డి, పీఆర్, ఎస్ఈ



ఈశ్వర్‌రెడ్డి, ఈఈ, ట్రాన్స్‌కో, రాయచోటి



భరత్ కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ



భరత్‌కుమార్‌రెడ్డి, ఐఎండ్‌పీఆర్, ఏడీ



పురుషోత్తం, డీపీఆర్ఓ



కృష్ణారావు, ఇండస్ట్రీస్



గురు ప్రకాష్, కోఆపరేటివ్ అధికారి



సుబ్రహ్మణ్యం, జిల్లా మైనింగ్ అధికారి



ఆంజనేయులు, ఐడీఎం



రాము, ఆర్టీసీ జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి



దీఆర్వో మధుసూదన్‌రావు



ఎస్.రమా, హెచ్ఎన్ఎస్ఎస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్




పి.అనిల్‌కుమార్, జిల్లా ఫైర్ ఆఫీసర్



భరత్‌కుమార్, జిల్లా సర్వేయర్



గుణశేఖర్ పిళ్లై, పశుసంవర్ధక శాఖ



నాగభూషణం, జిల్లా టూరిజం సాంస్కృతిక



మహబూబ్ బాషా, జిల్లా ట్రెజరీ అధికారి



చంద్ర నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి



రవిచంద్రబాబు ఉద్యానవన అధికారి



త్యాగరాజ్, మార్కెటింగ్ శాఖ



వెంకటరత్నం, డ్వామా

లోకవర్ధన్, ఆరోగ్యశ్రీ అధికారి

మేఘ స్వరూప్, మదనపల్లి సబ్ కలెక్టర్

తేజస్విని, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి

సహదేవ రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ



విశ్వనాథం, జిల్లా దేవదాయ అధికారి

కృష్ణమోహన్, రాయచోటి డీఎస్పీ

కొండయ్య నాయుడు, మదనపల్లి డీఎస్పీ

ఎం.శ్రీనివాసులు, ఏఆర్, డీఎస్పీ

రాజా రమేష్ ఎస్‌డీ, సీఐ-1

రాజారెడ్డి, ఎస్‌డీ, సీఐ-3

అయ్యో పాపం

- ట్రాక్టర్ ఢీకొని చిన్నారి దుర్మరణం
- కన్నీరు మున్నీరైన తల్లిదండ్రులు



మృతి చెందిన గానవి

నిమ్మనపల్లె : ముక్కుపచ్చలారని చిన్నారిని ట్రాక్టర్ దూసుకు వచ్చి ఢీకొనడంతో దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న పసిబిడ్డ కళ్లముందే మృతి చెందడంతో కన్న పేగు తల్లడిల్లిపోయింది.

అప్పుడే నూరేళ్లు నిండిపోయాయ అని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. కొండయ్యగారిపల్లెకు చెందిన ఉప్పుతోళ్ల పవిత్ర, సురేష్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు యక్షిత (5), చిన్న కుమార్తె గానవి (2) ఉన్నారు. అదే గ్రామానికి చెందిన పి.రెడ్డిఖాన్ కుమారుడు పి.రెడ్డిబాషా (34) ట్రాక్టర్‌తో ఓ రైతుకు చెందిన పొలం దుక్కి దున్ని తిరిగి ఇంటికి వస్తున్నాడు. గ్రామంలోని రాగ వీధిలో ఆడుకుంటున్న చిన్నారి గానవి పైకి ఆ ట్రాక్టర్ వేగంగా దూసుకుపోయి ఢీకొంది. చిన్నారికి తీవ్ర గాయాలు అయ్యాయి. హుటాహుటిన చికిత్స నిమిత్తం మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్సై తిప్పేస్వామి సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా, ట్రాక్టర్ నడిపి చిన్నారి మృతికి కారణమైన రెడ్డి బాషాపై చిన్నారి తండ్రి సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బొలెరో

- ఇద్దరు దుర్మరణం
- మృతులు రాయచోటి వాసులు



మృతి చెందిన మహేంద్ర



ఫయాజ్ మృతదేహం

బి.కొత్తకోట : ఒకరు కూలీ పనులు చేసుకొంటూ.. మరొకరు డ్రైవర్‌గా, చికెన్ సెంటర్ నడుపుతూ జీవించే వారు. ఇద్దరూ కలిసి కోళ్ల కోసం వచ్చి తీసుకుని వెళ్తుండగా ప్రమాదానికి గురై దుర్మరణం చెందారు. ఈ సంఘటన శనివారం రాత్రి బి.కొత్తకోట మండలం కోటిరెడ్డిగారిపల్లి వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటికి చెందిన ఎస్.ఫయాజ్ (30) స్థానికంగా చికెన్ సెంటర్ నడుపుతుండే వారు. డ్రైవర్‌గా కూడా పని చేస్తుంటారు. ఆయనకు భార్య షేక్ అమీనా, ఏడాదిన్నర వయసు కలిగిన కుమార్తె అర్పా ఉన్నారు. రాయచోటి సమీపంలోని శిబ్యాలకు చెందిన డి.మహేంద్ర (25) అవివాహితుడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తండ్రి సహదేవ అనారోగ్యంతో మంచాన పడ్డాడు. తల్లి వెంకటలక్ష్మమ్మ గృహిణి. వారిద్దరూ శనివారం సాయంత్రం 5 గంటల తర్వాత పెద్దతిప్పసముద్రం మండలం రంగసముద్రం వద్ద ఉన్న కోళ్లఫారంలో కోళ్లు కొనుగోలు చేసి తీసుకెళ్లేందుకు బొలెరో వాహనంలో రాయచోటి నుంచి బయలుదేరారు. రంగసముద్రంలో కోళ్లను తీసుకుని రాత్రి రాయచోటికి వెళ్లేందుకు తిరుగు ప్రయాణం అయ్యారు. పెద్దపాళ్యం మీదుగా జాతీయ రహదారిపై అంగళ్లు వైపు వెళ్తున్నారు. అదే సమయంలో మండలంలోని కోటిరెడ్డిగారిపల్లి వద్ద తమిళనాడుకు చెందిన లారీని డ్రైవర్ రోడ్డుపక్కన నిలిపి ఉంచాడు. అంగళ్లు వైపు బొలెరో వాహనం నడుపుతూ వస్తున్న డ్రైవర్ ఫయాజ్ మలుపు వద్ద ఎదురుగా నిలిపి ఉన్న లారీని గుర్తించలేకపోయాడు. దీంతో నేరుగా లారీ వెనుక వైపు బొలెరో వాహనం ఢీకొంది. బొలెరో ధ్వంసమై అందులోని ఫయాజ్, మహేంద్రకు శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటనా స్థలంలోనే ఇద్దరూ దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు రాత్రే ఘటనా స్థలికి చేరుకుని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఒకే ఘటనలో ఇద్దరు మృతి చెందడంతో ఆ కుటుంబాల వారు తీవ్ర ఆవేదనతో విలపించారు.

విచారణ జరపాలి

రోడ్డు పక్కన నిలిపిన లారీకి.. ఆగినట్టుగా పార్కింగ్ లైట్లను వేయాలి. అలా చేయడం ద్వారా వెనుక వైపు నుంచి వచ్చే వాహనాలకు ముందు వాహనం ఆగి ఉందని అర్థమై అప్రమత్తం కావడం ద్వారా ప్రమాదాలు జరగవు. అయితే కోటిరెడ్డిగారిపల్లె వద్ద నిలిపిన లారీ డ్రైవర్ రవాణా నిబంధనలు పాటించాడా లేదా అన్న దానిపైనా విచారణ జరపాల్సి వుంది. రెండు నిండు ప్రాణాలు బలి కావడానికి ఎవరి తప్పిదమో తేల్చాలి.

మా బిడ్డలకు ఏదీ రక్షణ?

- మీ పిల్లలను వేరే వాళ్లతో ఇలాగే బయటికి పంపుతారా?
- ఎస్వోను ప్రశ్నించిన విద్యార్థినుల కన్నవాళ్లు
- కస్తూర్బా విద్యాలయంలో పని చేయని సీసీ కెమెరాలు
- బాలికలచే వెట్టి చాకిరి
- ఆడిట్ బృందం తనిఖీలో విస్తుపోయే నిజాలు



సమావేశంలో ఎస్వో తీరుపై ప్రశ్నిస్తున్న పిల్లల కన్నవాళ్లు



విద్యార్థినుల హాజరు పరిశీలిస్తున్న ఆడిట్ సిబ్బంది

పెద్దతిప్పసముద్రం : 'మా బిడ్డలకు ఏదీ రక్షణ?' అంటూ విద్యార్థినుల తల్లిదండ్రులు కస్తూర్బా విద్యాలయం బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర శిక్షా, పీఎం పోషణ్ సామాజిక తనిఖీ బృందం 2024 జూన్ నుంచి డిసెంబర్ వరకు సంబంధించి గత కొన్ని రోజులుగా ప్రభుత్వ, రెసిడెన్సియల్ స్కూళ్లను తనిఖీ చేస్తోంది. ఈ క్రమంలో ఎస్సార్పీ సుబ్బారావు, డీఆర్పీలు నాగిరెడ్డి, భగవాన్, మల్లేష్‌లు చేపట్టిన తనిఖీలో ఎన్నో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో ఆడిట్ బృందం పిల్లల కన్నవాళ్లతో గ్రామసభ నిర్వహించి వాస్తవాలు బహిర్గతం చేసింది. 'ఏడవ తరగతి చదివే బాలికను బయటి వ్యక్తుల వెంట పంపడంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు, కన్నవాళ్ల అనుమతి లేకుండా మీ పిల్లలను వేరే వాళ్లతో ఇలాగే పంపుతారా, ఆచూకీ తెలిసింది కాబట్టి సరిపోయింది, మా బిడ్డలు ఏమైనా అయితే ఎవరు బాధ్యత వహిస్తారు' అని ఎస్వో శైలజాను విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. ఎస్వోతోపాటు ఆమె కుటుంబ సభ్యుల దుస్తులన్నీ బాలికలే ఉతికి ఆరేస్తున్నారని, పిల్లలతో వేకువజామునే చపాతీల పిండి రుద్దిస్తున్నారని, వంట పనులకు వాడుకుంటున్నారని, పనులు చేయని వారిని పత్రికల్లో రాయలేని విధంగా అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, కుల వివక్ష చూపుతున్నారని, ప్రత్యేక స్టోర్ రూం లేకపోవడంతో రాత్రి వేళ నిత్యావసర సరుకులు మాయం అవుతున్నాయని వారు వెల్లడించారు. భోజన విషయానికొస్తే అన్నంలో తల వెంట్రుకలు, పురుగుల అన్నం, నీళ్ల సాంబారు, పగలు మిగిలిన కూర రాత్రి పూట వడ్డించడం, గతంలో వండిన రసంలో బల్లి పడటం, మెనూ పాటించక పోవడం తదితరాలతో బాలికలు అర్ధాకలితో చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక మౌలిక సౌకర్యాల గురించి ఆరా తీస్తే.. 231 మంది బాలికలు ఉన్న ఈ స్కూల్‌కు సీసీ కెమెరాలు ఉన్నా పని చేయవు, పూర్తి స్థాయిలో ఫ్యాన్లు తిరగవు, మినరల్ ఆర్వోవాటర్ ప్లాంట్ ఉన్నా అది అలంకారమే, తద్వారా బోరు నీళ్లే దిక్కు, మరుగుదొడ్లకు తలుపులు ఉన్నా గడియలు లేవని వాపోయారు. నిబంధనల విషయానికొస్తే.. ఎస్వో భర్త ఎప్పుడుపడితే అప్పుడు స్కూల్‌లోకి వచ్చి పుష్టిగా భోజనం ఆరగించి అక్కడే ఉండటం, అస్తవ్యస్తంగా రిజిస్టర్ల నిర్వహణ, పేరెంట్స్ కమిటీ మీటింగ్ సక్రమంగా నిర్వహించకపోవడం, వాడేసిన న్యాప్‌కిన్స్ మిషన్‌లో బర్నింగ్ చేయాల్సి ఉన్నా యంత్రాన్ని వాడకుండా బయట పడేయడం, స్కూల్‌కు రాని పిల్లలు కూడా హాజరైనట్లు రిజిస్టర్‌లో నమోదు, పిల్లల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడం వంటి వాటితో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు వివరించారు. ఈ వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆడిట్ బృందం పేర్కొంది.

68 స్కూళ్లు తనిఖీ



జిల్లా వ్యాప్తంగా తమ బృందం 68 స్కూళ్లను తనిఖీ చేయాల్సి ఉండగా ఇప్పటికి 7 స్కూళ్లు పూర్తి చేశాం. మొదటగా మౌలిక వసతులు, తరగతుల వారీగా పిల్లలతో విడివిడిగా అభిప్రాయాలు, మెనూ, ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కన్నవాళ్లతో గ్రామసభ నిర్వహించి వాస్తవాలు వెల్లడిస్తాం. మా దృష్టికి వచ్చిన ఫిర్యాదులు, సరుకుల్లో వ్యత్యాసాల వివరాలను సమగ్రంగా విద్యాశాఖ ఎస్పీడీ కార్యాలయం, జిల్లా కలెక్టర్‌కు అందజేస్తాం.

- సుబ్బారావు, స్టేట్ రిసోర్స్ పర్సన్

మహిళ హత్య



రత్నమ్మ మృతదేహం

కురబలకోట : కురబలకోట మండలం జంగావారిపల్లె కాలనీకి చెందిన రత్నమ్మ (35) హత్యకు గురయ్యారు. ఆదివారం సంఘటన స్థలాన్ని ఎస్ఐ దిలీప్‌కుమార్ పరిశీలించారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చేలూరు ప్రాంతానికి చెందిన రత్నమ్మ (35) వివాహిత. భర్త, పిల్లలు ఉన్నారు. భర్తకు దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో ఆరేళ్ల క్రితం మండలంలోని జంగావారిపల్లె కాలనీకి చెందిన రెడ్డి శేఖర్ అలియాస్ శ్రీనివాసులుతో ఓ మద్యం షాపు వద్ద ఈమెకు పరిచయం అయ్యింది. ఇద్దరూ మద్యం సేవించేవారు. ఇది కాస్తా సహజీవనానికి దారి తీసింది. కూలీ పనులతో కాలం గడిపేవారు. శనివారం రాత్రి వీరిద్దరూ గొడవ పడ్డారు. మరో వైపు ఆమెపై ఇతనికి అనుమానం.

దీంతో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఆమె చనిపోయింది. శరీరంపై నల్లగా కమిలిన గాయాలు ఉండడంతో హత్యగా భావించి పోలీసులు మృత దేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.